www.prajasakti.com
# ప్రజాశక్తి
శనివారం 25 అక్టోబర్ 2025
5
పశ్చిమ గోదావరి



## రోడ్డు పునర్నిర్మించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ నుంచి ఏనుగువాని లంక గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదని ఈ రహదారిని వెంటనే పునర్ నిర్మించాలని కోరుతూ శుక్రవారం ఏనుగువానిలంకలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి బహిరంగ సభలో పాల్గొన్న జల వనరుల శాఖా మంత్రి నిమ్మలకు సిపిఎం సీనియర్ నేత మానవరపు సుబ్బారావు నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి నిమ్మల మాట్లాడుతూ మేడపాడు నుంచి యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక వరకు రహదారి పునర్నిర్మాణానికి ఇప్పటికే సుమారు రూ.8 కోట్లతో ప్రతిపాదన ఆర్అండ్బి అధికారులకు పంపించడం జరిగిందని, నిధుల కొరత ఉన్నప్పటికీ రహదారి త్వరలోనే పునర్నిర్మించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావుతో పాటు సిపిఎం నాయకులు గుబ్బల విష్ణు, చెల్లుబోయిన త్రిమూర్తులు పాల్గొన్నారు.

# ఉపాధి చూపరు.. భృతి ఇవ్వరు..!

**నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం**

**జిల్లా ఉపాధి కార్యాలయంలో 45,397 మంది నమోదు**

**నమోదు చేసుకోనివారి సంఖ్య వేలల్లోనే**

**వర్క్ఫ్రం హోమ్ కల్పిస్తామని చేసిన సర్వే ఏమైందో..?**

**నెలకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతిపై చర్చ**



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులను అన్నివిధాలా ఆదుకుంటామని కూటమి ఎన్నికల్లో నమ్మబలికింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏమాత్రం కల్పించని పరిస్థితి నెలకొంది. ఉద్యోగాలు కల్పించకపోతే నెలకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ సైతం అమలు కాలేదు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ నిరుద్యోగులకు హామీల వర్షం కురిపించింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటి వరకూ నిరుద్యోగ భృతి అందిస్తామని మేనిఫెస్టోలో సైతం పెట్టింది. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడిన పరిస్థితి లేదు. ఏలూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో 2025 సెప్టెంబర్ నాటికి 45,397 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో 31,280 మంది పురుషులు ఉండగా, 14,117 మంది మహిళలు ఉన్నారు. ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకోని వారి సంఖ్య వేలల్లోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నిర్వహించిన జాబ్మేళాల్లో 930 మంది ప్రయివేట్ సంస్థలకు ఎంపికైనట్లు ఉపాధి కార్యాలయ లెక్కలు చెబుతున్నాయి. ఏడాదిన్నర గడిచినా పట్టుమని వెయ్యి మందికి కూడా ఉద్యోగాలు కల్పించని పరిస్థితి ఉంది. జిల్లాలో కొత్తగా వచ్చిన పరిశ్రమలు సైతం పెద్దగా లేకుండాపోయాయి. దీంతో నిరుద్యోగుల పరిస్థితి అయోమయంగా మారింది. ఉద్యోగాలు కల్పించే వరకూ నిరుద్యోగులకు నెలకు రూ.మూడు వేల చొప్పున భృతి అందిస్తామని కూటమి సర్కార్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది. ఇప్పటి వరకూ దీనిపై ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాల్లేవు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని నిరుద్యోగుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం నిరుద్యోగులకు నెలకు రూ.రెండు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. ఐదేళ్లపాటు అమలు చేయకుండా ఎన్నికలకు మూడు నెలల ముందు నిరుద్యోగ భృతి పేరుతో హడావుడి చేసింది. యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో 2019 ఎన్నికల్లో టిడిపి ఘోర పరాజయం పాలైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలకు కేవలం రెండుచోట్ల మాత్రమే గెలిచింది. నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. నిరుద్యోగ భృతి ఈసారి సక్రమంగా అమలు చేయపోతే కూటమి సర్కార్ అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్తున్నారు.

**వర్క్ఫ్రం హోమ్ సర్వే ఏమైనట్లు..?**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం వివిధ రకాల సర్వేలు చేయించింది. అందులో నిరుద్యోగులకు సంబంధించిన సర్వే అత్యంత ముఖ్యమైనదని చెప్పొచ్చు. ఇంటి వద్దనే ఉంటూ వర్క్ఫ్రం హోమ్ చేయాలనుకునే వారి డేటాను సచివాలయ ఉద్యోగులు సేకరించారు. వర్క్ఫ్రం హోమ్ కోసం ముందుకొచ్చిన నిరుద్యోగుల నుంచి సర్టిఫికెట్లు సైతం తీసుకుని అప్లోడ్ చేశారు. ఇప్పటి వరకూ అందుకు సంబంధించి ఎటువంటి సమాచారమూ అభ్యర్థులకు లేకుండా పోయింది. సచివాలయ ఉద్యోగుల వద్దకు వెళ్లే తమకు ఏమీ తెలియదని, సర్వే చేసి, సర్టిఫికెట్లు అప్లోడ్ చేయడం వరకు మాత్రమే తమ పని అని చెబుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్ పేరుతో చేసిన సర్వే ఏమైందో ఏఒక్కరూ సమాధానం చెప్పడం లేదు. దీంతో వర్క్ఫ్రం హోమ్ కోసం ముందుకొచ్చిన ఎంతోమంది మహిళా నిరుద్యోగులు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండాపోయింది. దీంతో నిరుద్యోగ యువతలో ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.


నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు

# మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ఆపాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం**

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్, భీమవరం రోడ్డులో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరించాలని నిర్ణయించి, జిఒ తీసుకురావడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఈ వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.వందల కోట్లు ఖర్చు పెట్టాయని, ఇంకొంచెం ఖర్చు పెడితే పనులు పూర్తయ్యి, ప్రజా వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ తరుణంలో ఈ వైద్య కళాశాలలను ప్రయివేటీకరించడం అంటే వైద్య విద్యను సామాన్యులకు, పేదలకు, ప్రతిభ గల వారికి దూరం చేయడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పిపిపి అంటే ప్రజాధనం రూ.వందల కోట్లను ప్రయివేట్ వ్యక్తులకు, ప్రయివేట్ సంస్థలకు పందేరం పెట్టడమేనన్నారు. ఈ వైద్య కళాశాలలను ప్రభుత్వమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రయివేటీకరణ విధానాలు మానుకోవాలని హితవు పలికారు. బకాయిలు వెంటనే చెల్లించి ఆరోగ్యశ్రీ అందరికీ అందేలా చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసిపి పాలన తరహాలోనే ముందుకెళ్తుందన్నారు. జిఎస్టి తగ్గించాం పండుగ చేసుకోండని బిజెపి ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ఆపకపోతే రానున్న రోజుల్లో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పెంటపాడు మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నేతలు జవ్వాది శ్రీను, సత్తి కోదండ రామిరెడ్డి, బంకురు నాగేశ్వరరావు, చిటికిన రాము, యాసరపు ఎర్రి నాయుడు, దేశంశెట్టి సతీష్, ఎ.వేణు, జి.రాజు, కుంచంగి నానాజీ, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**భీమవరం టౌన్:** కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించడం ఆపాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలం వెంప గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిన మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టడం తగదనాఆనరు. ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కళాశాలలను పూర్తి చేసి ప్రజలకు, యువతకు విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాటికి రాజు, బొడ్డు ఏసురాజు, ఇంజేటి శాంతరాజు, ఇంజేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# వీడని వర్షం

**జిల్లాలో నాలుగు రోజులుగా కుండపోత వర్షం**


ఆచంటలో..

ప్రజాశక్తి - భీమవరం

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి భారీ వర్షం కురిసింది. వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. ఇప్పటికే ఎన్నో గండాలను దాటుకుని సాగులో ముందుకు సాగుతున్న అన్నదాతలకు భారీ వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. ప్రస్తుతం పంట ఈనిక, గింజ, పాలు పోసుకునే దశలో ఉండటంతో వర్షానికి తడుస్తూ వరి కంకులు బరువెక్కి మొదలు పట్టు కోల్పోయి నేల వాలే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేలు వరకు పెట్టుబడి పెట్టామని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకొల్లు, నరసాపురం, వీరవాసరం, తణుకు, అత్తిలి, మొగల్తూరు, ఆచంట, పోడూరు మండలాల్లో వరిచేలలో భారీగా వర్షపు నీరు చేరుతోంది. కాల్వలు, డ్రెయిన్లన్నీ పొంగిపొర్లుతుండటంతో వరిచేలలో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో మూడు రోజుల నుంచి వరి దుబ్బులన్నీ నీటిలోనే నానుడుతుండడంతో కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులన్నీ జలమయమయ్యాయి. కనుచూపు మేర వర్షపు నీరు నిండి ఉండడంతో చెరువులను తలపిస్తున్నాయి. భీమవరం పట్టణంలో ఆర్టిసి డిపో, లూథరన్ గ్రౌండ్, బ్యాంకు కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, మెంటే వారి తోట, దుర్గాపురం ప్రాంతాలు జలమయమయ్యాయి. కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, జువ్వలపాలెం రోడ్డు, బాంబే స్వీట్ రహదారి, మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రహదారులు నీట మునిగాయి. 216 జాతీయ రహదారి శృంగవృక్షం, పెన్నాడ అగ్రహారం, గొరగనమూడిల్లో నీట మునిగింది. భీమవరం-తాడేపల్లిగూడెం రహదారిలో గరగపర్రు వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రైల్వే అండర్ బ్రిడ్జిల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో వాటి గుండా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

**గణపవరం:** బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడన ప్రభావం వల్ల మూడోరోజు శుక్రవారం మండలంలో వర్షం కురిసింది. ఈ వర్షాలు కొనసాగితే వరి పంటకు నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. ఇక రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. గణపవరం-భీమవరం రహదారి పూర్తిగా గోతులతో నిండి రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. ఉదయం పది గంటల తర్వాత కారుమబ్బులతో వర్షం కురవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీడకుండా కురుస్తున్న వర్షంతో చెరువుల్లో రొయ్యలకు ఆక్సిజన్ అందక తేలిపోతున్నాయని, కష్టమైనా, నష్టమైనా నిరంతరం ఏరియేటర్స్ తిప్పాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

**పెనుమంట్ర :** మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రోజు వారీ పనులు చేసుకుని పొట్ట నింపుకునే కూలీలు, భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిరు దుకాణదారులైతే కొనుగోళ్లు లేక ఢీలాపడ్డారు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలోని అన్ని రహదారులు కనీసం నడవడానికీ ఇబ్బందిగా మారుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆచంట:** నాలుగో రోజు శుక్రవారం మండలం తడిచి ముద్దయింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పలు కాలనీలో పల్లపు ప్రాంతాలు, పంట పొలాల్లో ముంపు నీరు చేరింది. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఆచంట, ఆచంట వేమవరం, పెనుమంచిలి, భీమలాపురం, కరుగోరుమిల్లి, కొడమంచిలి పంచాయతీల పరిధిలోని కాలనీలు ముంపుబారిన పడ్డాయి. రహదారులు అధ్వానంగా మారాయి. గోతులు బురదతో నిండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆచంట పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఆచంట కచేరి సెంటర్లో జన సంచారం లేక నిర్మానుష్యంగా మారింది. వర్షం నేపథ్యంలో మండలంలోని ప్రధానమైన నక్కల, తాడేరు, కొఠాలపర్రు మురుగు డ్రెయిన్లు వర్షపు నీటితో నిండుకున్నాయి. వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది.

**తాడేపల్లిగూడెం:** పట్టణంలో శుక్రవారం నాలుగో రోజు వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని మసీదు రోడ్డు, టిటిడి కళ్యాణ మండపం రోడ్డు, ప్రత్తిపాడు-బాదంపూడి రహదారులు అధ్వానంగా మారాయి.

**పాలకొల్లు:** పాలకొల్లులో శుక్రవారం నాలుగో రోజు వర్షం దంచి కొట్టింది. ఉదయం బాగా ఎండ కాసినప్పటికి 10 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో డ్రెయిన్లు, రోడ్లపై నీరు ఏరులై పారింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని డ్రెయినేజీ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నీట మునిగింది. ఎల్ఐసి కార్యాలయంతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లోకి నీరు చేరింది. జిల్లాలో అత్యధిక వర్షపాతం 137 మిల్లీమీటర్లు పాలకొల్లులోనే నమోదైంది.

**మొగల్తూరు:** మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాలకు కాలనీలు జలమయమయ్యాయి. ఉప్పుటేరు పాయలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆక్వా చెరువులు, వరిచేలు ముంపు బారిన పడుతున్నాయి. మండలంలో 119.2 వర్షపాతం నమోదైంది.

**పెనుగొండ రూరల్:** భారీ వర్షాలకు మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేని వర్షంతో జనం బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని మునుమర్రు, కొఠాలపర్రు, దేవ, తామరాడ తదితర గ్రామాల్లో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.


శృంగవృక్షంలో జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వర్షపునీరు


పాలకొల్లులో..

## ముంపులో పంట పొలాలు

**ఏలూరు జిల్లాలో 1987, పశ్చిమలో 2,988 ఎకరాల్లో మునకలో పంట**

**దిక్కుతోచని స్థితిలో 3,078 మంది రైతులు**

**ఎడతెరిపిలేని వర్షంతో వరిసాగుపై తీవ్ర ప్రభావం**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన మూడు రోజులుగా అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రెండు జిల్లాల్లోనూ పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా వరిసాగుపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వర్షాలకు ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 1,102 మంది రైతులకు చెందిన 1987 ఎకరాలు, పశ్చిమలో 1976 మంది రైతులకు సంబంధించిన 2,988 ఎకరాలు ముంపుబారిన పడినట్లు రెండు జిల్లాల వ్యవసాయాధికారులు తెలిపారు. వర్షాలకు ఏలూరు జిల్లాలో కైకలూరు, పోలవరం, కలిదిండి, ఏలూరు, లింగపాలెం, భీమడోలు, ముదినేపల్లి, పెదపాడు, కామవరపుకోట మండలాల్లోని 31 గ్రామాల పరిధిలో మొత్తం 69,891 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, వర్షాలకు 1,987 ఎకరాల్లో ముంపునకు గురైంది. పశ్చిమలో ఆకివీడు, ఉండి, కాళ్ల, ఇరగవరం, నరసాపురం మొగల్తూరు, యలమంచిలి మండలాల్లోని 44 గ్రామాల పరిధిలో 2,988 ఎకరాలు పంట నీట మునిగినట్లు ప్రాథమిక అంచనాల్లో అధికారులు తేల్చారు. ముంపుకు గురైన పంటంతా పొట్ట, ఈనికదశల్లో ఉంది. రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలకు పంట ముంపునకు గురవ్వడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వర్షాలు మరో రెండు రోజులు ఉంటే పంటనష్టం మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉంది. పంట కాలువలు పూడిపోవడంతో పొలాల్లో నీరు దిగువకు వెళ్లని పరిస్థితి నెలకొంది. ఎక్కువ రోజులు పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉంటే పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరిదశలో కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర నష్టాలబారిన పడే పరిస్థితి ఏర్పడింది.


మాట్లాడుతున్న రాజారామ్మోహన్రాయ్

# 28, 29 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 28, 29 తేదీల్లో పెనుగొండలో జరగనున్న 13వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్రాయ్ అన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వాన్బర్రి యూనియన్ జనరల్బాడీకి ముఖ్యతిథిగా రాయ్, పివి.ప్రతాప్ మాట్లాడుతూ సిఐటియు 1970లో ఏర్పడిన నాటి నుండి నేటి వరకు కార్మికులు, ఉద్యోగులు పక్షాన నికరంగా సమరశీల పోరాటాలు చేస్తుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకోసారి సిఐటియు మండలం నుండి ఆలిండియా వరకు మహాసభ జరుగుతుందన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకోసారి ప్రభుత్వాలు మారినా కార్మికులు, ఉద్యోగులు బతుకుల్లో ఎలాంటి మార్పులూ లేవని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపద సృష్టికర్తలైన కార్మికులను, వారి శ్రమను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. సిఐటియు శ్రమదోపిడీ లేని సమాజం కోసం కార్మికవర్గాన్ని ఐక్యం చేస్తుందన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పేరుతో ప్రభుత్వమే చట్టవిరుద్ధంగా శ్రమ దోపిడీకి పాల్పడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్కోడ్లు కార్మికుల పాలిట శాపంలా మారాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచడాన్ని, అర్ధరాత్రి మహిళలకు డ్యూటీ వేయడాన్ని సిఐటియు వ్యతిరేకిస్తుందన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకోసారి వేతనాలు పెంచాల్సిన పాలకులు పెంచకపోవడం వల్ల ఆందోళనలు చేయాల్సి వస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అందరికీ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన మాటకు అనుగుణంగా ఆర్థిక సహాయం పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ, కార్మికులను బానిసలుగా మార్చుతున్నారన్నారు. అంగన్వాడీ, ఆశాలకు, ఐకెపి, ఎండిఎం, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, యూనియన్ కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ గుబ్బల గోపీ, నేతలు ఎం.హర్షవర్ధన్, రామకృష్ణ, పి.దక్షిణామూర్తి, గోవిందరాజు, శ్రీనివాసరాజు, త్రిమూర్తులు, జయకృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గోతుల పూడ్చివేతకు తక్షణం నిధులివ్వండి

**వచ్చే జనవరికి పక్కాగా రోడ్లు వేయకపోతే ప్రజా పోరాటాలు : సిపిఎం**


మాట్లాడుతున్న జుత్తిగ నర్సింహమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

చేపల చెరువుల్లో తలపించేలా అత్యంత ప్రమాదకరంగా ఉన్న గోతులు పూడ్చడానికైనా తక్షణం నిధులు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా నేత, మాజీ ఎంపిపి జుత్తిగ నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నౌడూరు జంక్షన్లోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు మళ్లీ ఓట్లు వేయాలంటే బతికి ఉండాలని, ఈ రోడ్లు ఇలా ఉంటే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం గోతులు పడ్చాలని కోరారు. 2020 నుండి సిపిఎం ఒకటే రోడ్ల సమస్యపై దశలవారీగా పోరాడుతుందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రోడ్లు వేయకపోవడంతోనే అధికారం కోల్పోయిందని, కూటమి అధికారం చేపట్టి 18 నెలలు దాటుతోందని అన్నారు. అయితే ఎప్పటికప్పుడు రోడ్ల సమస్యపై ప్రకటనలు తప్ప కార్యాచరణ కరువైందని, ఫలితంగా జనం రోడ్డెక్కాలంటేనే భయపడే దుస్థితి దాపురించిందన్నారు. నౌడూరు జంక్షన్ నుండి మడుగుపోలవరం రోడ్డు 23 అడుగులు వెడల్పుకు విస్తరించి, సీసీ రోడ్డు నిర్మించే వరకూ బోర్డులు పెట్టి భారీ వాహనాల రాకపోకలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్డు మరమ్మతులకు రూ.25 లక్షలు, వీరవాసరం నుంచి బాలేపల్లి, దూసనపూడి రోడ్డు మరమ్మతుకు రూ.లక్ష, శాశ్వత పనులకు రూ.మూడు కోట్లు, బుధారాయుడు చెరువు నుండి తోలేరు పడమరపాలెం రోడ్డు మరమ్మతుకు రూ.కోటీ 20 లక్షలు, శాశ్వత పనులకు రూ.ఏడు కోట్లు నవుడూరు-వేంద్ర రోడ్డు మరమ్మతులకు రూ.40 లక్షలు, శాశ్వత నిర్మాణానికి రూ.కోటీ 20 లక్షలు, తోలేరు రోడ్డుకు రూ.నాలుగు కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని అధికారులు తెలిపారన్నారు. వీరవాసరం నుండి నవుడూరు వరకు రోడ్డు రూ.మూడు కోట్లతో త్వరలో వేయనున్నట్లు తెలిపారన్నారు. మడుగు పోలవరం రోడ్డుకు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం ఎందుకు నిధులివ్వడం లేదని ప్రశ్నించారు. అధికారులు ఇచ్చిన హామీల ప్రకారం రోడ్డు వేయకపోతే డిసెంబర్లో ప్రజలను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అయినపూడి బాబూరావు, కేతా జ్యోతిబసు, తాళ్లూరి హరిహర రామలక్ష్మణ్, పాలా కోటేశ్వరరావు, జుత్తిగ శ్రీనివాస్, కిలాడి సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు, కుడిపూడి పెద్దిరాజు, నూకరాజు, మొల్లి అప్పారావు, గిద్ద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్‌కు కోత నివారణ గోడ నిర్మాణం పూర్తి చేయాలి

**కలెక్టర్ నాగరాణి**


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - నరసాపురం

కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ దత్తత గ్రామం పెదమైనవానిలంకలో సముద్రపు కోతకు గురి కాకుండా నిర్మిస్తున్న అడ్డుగోడను వచ్చే డిసెంబర్ నాటికి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. పెదమైనవానిలంక గ్రామం వద్ద కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ సమకూర్చిన సిఎస్ఆర్ నిధులు రూ.13.5 కోట్ల వ్యయంతో ఒక కిలోమీటర్ పరిధిలో నిర్మాణం చేపట్టిన సముద్రపు కోత నిరోధక కట్ట నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఏదైనా ఇబ్బందులుంటే జిల్లా యంత్రాంగం దృష్టికి వెంటనే తీసుకురావాలని సూచించారు. తొలి విడతగా ప్రారంభించిన అడ్డుకట్ట నిర్మాణ పనులు 400 మీటర్ల పరిధిలో పురోగతిలో ఉన్నాయని, దీనిలో 60 మీటర్ల పరిధిలో జియోట్యూబ్ ఏర్పాటు, 200 మీటర్ల పరిధిలో జియోవాల్ నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. మొత్తం పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం తీవ్ర వాయుగుండం దృష్ట్యా సముద్ర తీర ప్రాంతంలో పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే వేటకెళ్తే తిరిగి ఒడ్డుకు చేరుకోవాలని, అక్కడకు చేరుకున్న మత్స్యకారులకు సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా యంత్రాంగం, ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్య క్రమంలో నరసాపురం ఆర్డిఒ దాసి రాజు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పిఆర్ఒ పి.మోహన్రావు, ఇరిగేషన్ ఇఇ సత్యనారాయణ, ఇన్ఛార్జి తహశీల్దార్ ఎన్ఎస్ఎస్వి.ప్రసాద్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**మహిళలకు ప్రత్యేక శిక్షణ**

జిల్లాలో చాలామంది మహిళలు సరైన అవగాహన లేక గల్ఫ్ దేశాలకు వెళ్లి మోసపోతున్నారని, వారికి అండగా నిలిచేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం రూపొందించి అమలుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పెదమైనవానిలంక డిజిటల్ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎమ్డి, సిఇఒ గుమ్మల గణేష్కుమార్ కలెక్టర్‌కు డిజిటల్ భవనంలో చేపట్టిన నైపుణ్యాభివృద్ధి శిక్షణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గల్ఫ్‌కు వెళ్లే ప్రతిఒక్కరి పూర్తి వివరాలను రిజిస్టర్ చేయాలన్నారు. సముద్రతీర ప్రాంతంలోని మత్స్యకార ఎస్హెచ్జి మహిళలకు సముద్రపు నాచు సాగుపై శిక్షణ అందించామన్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేయడం ద్వారా ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని, ఈ దిశగా యువతను ప్రోత్సహించాలని సూచించారు. తూర్పుతాళ్లు లక్కవరం వద్ద కొంతమంది గ్రామస్తులు కలెక్టర్ కారును ఆపి కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుందని వాపోయారు. కలెక్టర్ స్పందించి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆర్డబ్ల్యుఎస్ అధికారిని ఆదేశించారు.

## మహిళలపై అఘాయిత్యాలను ప్రభుత్వం అడ్డుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళలపై అఘాయిత్యాలను ప్రభుత్వం ఆపాలని, లేనిపక్షంలో రోజురోజుకీ మరింత పెరిగే ప్రమాదం ఉందని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ఉదయకుమారి, పి.పూర్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ జిల్లా తునిలో గురుకుల పాఠశాల సంఘటనే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఘటనతో మహిళలకు ఎక్కడా రక్షణ లేదని, బాలికల పరిస్థితి అయితే మరింత దారుణంగా ఉందని స్పష్టమవుతోందని తెలిపారు. ఈ కేసులో నిందితుడు మృతి చెందినా, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలకులు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ఆ బాలిక విద్యాభ్యాసానికి ఆటంకం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. విష సంస్కృతిని రూపుమాపే విధానాలు పాలకులు అవలంబించడంతోపాటు కనీసం ఉన్న చట్టాలనైనా కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.


ముంపుకు గురైన రహదారులు చూపుతున్న సిపిఎం నాయకులు

## డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తోకతిప్ప గ్రామంలో డ్రెయినేజ్ వ్యవస్థ లేక రహదారులు కాల్వలను తలపిస్తున్నాయని సిపిఎం మండల కమిటీ విమర్శించింది. ముంపు ప్రాంతాల్లో శుక్రవారం సిపిఎం మండల కమిటీ పర్యటించింది. ముఖ్యంగా గ్రామంలో తుమ్మలదిబ్బ ఏరియాలో వర్షపు నీరు చేరిందన్నారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి బుద్ధ లక్ష్మీపతి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంట కాలువ పొంగి నీరు తుమ్మల దిబ్బకు ప్రవహించడం వల్ల ముంపునకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ముంపునకు గురికాకుండా కాలువకు అడ్డుకట్ట వేయాలని, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి శ్రావణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమాని సూర్యనారాయణ, బొద్దు రాంబాబు, పొన్నాల నాగలక్ష్మి, నాగిడి విజయ్ కుమార్ సాయి, పొన్నాల అజయ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిడమర్రు సిఐ నక్కా రజనీకుమార్ అన్నారు. శుక్రవారం గణపవరం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశానికి కాలేజ్ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. సమావేశంలో రజనీకుమార్ మాట్లాడుతూ తెలియని నెంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వచ్చే లింక్స్‌ను క్లిక్ చేయొద్దన్నారు. ఆన్‌లైన్ ఏదైనా మోసానికి గురైనవారు పోలీసులను సంప్రదించాలని సూచించారు. గణపవరం ఎస్ఐ ఎం.మణికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా వాడుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, లెక్చరర్లు కెవి.గణేష్‌కుమార్, జి.వెంకటరమణ, ఎస్.వెంకన్నబాబు, విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఛాంబర్స్‌లో ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ కళాశాలల ప్రాంగణంలో శుక్రవారం ఆధార్ క్యాంపు ప్రారంభమైందని, ఈనెల 27వ తేదీ వరకూ క్యాంపు నిర్వహిస్తున్నామని కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు తెలిపారు. ఈ ఆధార్ కార్డు నమోదులో మార్పులు, చేర్పులు చేసేందుకు కళాశాల విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాలైన బ్రాడీపేట, పూలపల్లి ఎల్లార్‌పేట, నాగరాజుపేట, హౌసింగ్ బోర్డుకాలనీ వాసులు కూడా ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 15 సంవత్సరాలు నిండిన పిల్లలు ఆధార్ నమోదులో మార్పులు, చేర్పులు చేయించుకోవాలని అవగాహన కల్పించేందుకు కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కెవి.సీతారామరాజు, సచివాలయ సిబ్బంది ఆంగ శివన్నారాయణ, కెఎన్‌వి కె.కళ్యాణి, కె.వెంకటలక్ష్మి, పి.కల్పన, జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

## వాతావరణ మార్పులపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్‌ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం వారు అంతర్జాతీయ వాతావరణ కార్యాచరణ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ తిరువీధుల రాజరాజేశ్వరి మాట్లాడారు. వాతావరణంలో అవాంఛనీయ మార్పులను పరిష్కరించాల్సిన అవసరం గురించి అవగాహన పెంచడానికి ఈ అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం జరుపుతారన్నారు. ప్రపంచంలో అత్యధిక అటవీ కార్బన్ సింక్‌లున్న మొదటి పది దేశాల్లో భారత్ కూడా ఉందని తెలిపారు. రసాయన శాస్త్ర విభాగ అధిపతి వి.యామిని మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి, ఐపిసిసి వంటి సంస్థల నివేదికలు ప్రపంచ ఉష్ణోగ్రతలు ఇప్పటికంటే 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని, వాటిని అదుపులో ఉంచే చర్యలపై విద్యార్థులకు అవగాహన అవసరం అన్నారు. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం, కాలుష్య ఉద్గారాలను నియంత్రించడం వంటి అంశాల కార్యాచరణలో భారత్ తన పాత్రను సమర్థవంతంగా పోషిస్తోందని వక్త వంశీ చెప్పారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం వారు, ఎన్ఎస్ఎస్ 1, 2 యూనిట్ల వారు ఐక్యరాజ్యసమితి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు రూరల్ లయన్స్ క్లబ్ నిర్వాహకులు బహుమతులు అందించారు. అలాగే పాలకొల్లు మున్సిపాల్టీ వారు పురమిత్ర యాప్‌పై అవగాహన కల్పించారు. వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన కళాశాల విద్యార్థులను అతిథులు ప్రసంశించారు. కార్యక్రమంలో పాలకొల్లు రూరల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ ఎస్‌వి.రంగారావు వారి సిబ్బంది, వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రీసర్వేలో సమస్యలుంటే దరఖాస్తు చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

రీ సర్వేలో సమస్యలుంటే దరఖాస్తులు అందించాలని ఆర్‌డిఒ దాసి రాజు రైతులకు సూచించారు. కెపి.పాలెంసౌత్ సచివాలయంలో తహశీల్దార్ కె.రాజకిశోర్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రీసర్వేపై గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాయింట్ ఎల్‌పిఎం ఇతర సమస్యలు ఏమన్నా సరే పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి సోంబాబు ఎంపిటిసి అందే దొరబాబు, ఎడి సర్వేయర్ జాషువా, డిఐఒ ఎస్.కుమార్, మండల సర్వే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా వేములదీవి గ్రామం పరిసర ప్రాంతాలు వడ్డీవారిమెరక, సర్దుకొడప, కాపులకొడప తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ శుక్రవారం వేములదీవి గ్రామాన్ని సందర్శించి, వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వరదల కారణంగా నష్టపోయిన గృహాలను పరిశీలించి, బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున బాధితులకు అన్ని విధాలా సహాయం అందిస్తామన్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకుని, అవసరమైన సహాయాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వేములదీవి వెస్ట్ సర్పంచి ఒడుగు ఏసుబాబు, ఉంగరాల నాగరాజు, బందెల రవీంద్ర, వలవల నాని పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇపిడిఎసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ ఫీడర్‌కు సంబంధించి హౌసింగ్ బోర్డు ఏరియా, శశి కాలేజీ రోడ్డు, ఎన్ఎస్.రాజు లేఅవుట్ ఏరియాలకు లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



## తాగునీటి పథకం పనులకు మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని ఏనుగువానిలంక గ్రామంలో శుక్రవారం రూ.85 లక్షల నిధులతో చేపట్టనున్న తాగునీటి పథకం పనులకు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆ పార్టీ మండల అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు అధ్యక్షత వహించారు. సభలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో కనీసం తాగునీరు కూడా అందించలేని పరిస్థితి వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఏనుగువానిలంక గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జల జీవన్ మిషన్ ద్వారా రూ.285 లక్షల నిధులు వెచ్చించడం జరుగుతుందని, దీనిద్వారా ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో తాగునీటి సమస్యతోపాటు చాలాచోట్ల డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని తన దృష్టికి వచ్చిందని భవిష్యత్తులో ప్రాధాన్యతా క్రమంలో డ్రెయినేజీని పూర్తిగా నిర్మించి ఇస్తామని, ప్రజలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉన్నమట్ల కబర్ది, బొప్పన హరికిషోర్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, ఇనుకొండ వెంకటేశ్వరరావు (ఐవిఆర్), ఆరిమిల్లి రామ శ్రీనివాస్, ముచ్చర్ల శ్రీనివాస్, గుబ్బల ఏడుకొండలు, చింతా సత్తిబాబు, తిరుమాని శ్రీనివాస్, పీతల శ్రీనివాస్, సానబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

## కోటిమొగ దొంగపిండి కాలువ పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కొత్త పూసలమర్రు గ్రామం వద్ద కోటిమొగ దొంగపిండి కాలువ పూడికతీత పనులను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో పంట, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కోటిమొగకాలువ పరిసర ప్రాంతాల రైతులు స్వచ్ఛందంగా పూడిక తీత పనులు చేయడం సంతోషకరమని స్థానిక రైతులను లోసరి గుట్లపాడు నీటి సంఘం కమిటీ సభ్యులను అభినందించారు. నీటి సంఘం ఛైర్మన్ కొల్లాటి వరలక్ష్మి గోవిందరాజు మాట్లాడుతూ 4 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించి కోటిమొగ కాలువ పూడికతీత గురించి స్థానిక రైతులను కోరగా స్వచ్ఛందంగా వారు ముందుకొచ్చి పనులు ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు. లోసరి గోట్లపాడు సహకార బ్యాంకు అధ్యక్షుడు బొమ్మిడి మధుసూదనరావు మాట్లాడుతూ సుమారు రూ.20 లక్షల వ్యయంతో కాలువ పూడికతీత పనులను సీతారామలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్, టిడిపి మండల అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, నీటి సంఘం వైస్ ఛైర్మన్ కొప్పర్తి సత్యనారాయణ, ఎంపిటిసి తిరుమల తులసీరావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## 5న అల్లూరి జాతీయ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో అల్లూరి సీతారామరాజు జాతీయ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ నవంబర్ 5న ప్రారంభి స్తున్నట్లు మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య, కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ చెప్పారు. వారు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం మీడియా సమావేశంలో మాట్లా డారు. పాలకొల్లు నుంచి ఎందరో కళాకారులు చిత్ర పరిశ్రమలో స్థిరపడ్డారని, అయితే ఇటీవల తగ్గినందున ఉత్సాహంగా ఉండేవారికి శిక్షణ ఇచ్చేందుకు నవంబర్ 5న ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ కోరేవారు నవంబర్ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబర్‌లో ట్రస్టీ కమిటీలో ఎంపిక జరుగుతుందని చెప్పారు. జనవరి నుంచి ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్‌గా ఉన్న సినీ దర్శకులు రాజా వన్నెంరెడ్డి శిక్షణ ఇస్తారని చెప్పారు. ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ అభివృద్ధికి మంత్రులు నిమ్మల రామానాయుడు, దుర్గేష్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. పాలకొల్లు వంటి మారుమూల ప్రాంతాల్లో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ పెడితే అన్ని ప్రాంతాలు అభివృద్ధి అవుతాయని జోగయ్య పట్టుదలతో ఈ ఇనిస్టిట్యూట్ ప్రారంభిస్తున్నారని వన్నెంరెడ్డి చెప్పారు. దీని ప్రారంభానికి ముందుకొచ్చిన గాంధీభగవాన్‌రాజును అభినందించారు. సమావేశంలో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఉపాధ్యక్షులు డిటిడిసి బాబు, బోనం వెంకట నర్సయ్య, కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, సహాయ కార్యదర్శి విరాకుల వెంకటరమణ, కోశాధికారి కలిదిండి గణపతిరాజు, సభ్యులు చేకూరి సూరిబాబు, కెవి.కృష్ణవర్మ, రేపాక ప్రవీణ్, వీరా పోతన, కాలనాథ బొట్ల తదితరులు పాల్గొన్నారు.

## బాల్యంలో బాగా చదువుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నరసాపురం


కలెక్టర్ కు స్వాగతం పలుకుతున్న నాయకులు

బాల్యంలో బాగా చదువుకోవాలని, ఆడపిల్లలు ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శుక్రవారం లక్ష్మణేశ్వరం నక్కావారి పేటలోని మహాత్మా జ్యోతిబా పూలే రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదులను స్వయంగా పరిశీలించి విద్యార్థులతో కొద్ది సమయం ముచ్చటించి మాట్లాడారు. బాల్యంలో చదువుకోవడం ఒక్కటే మీకు ఉన్న బాధ్యత అని తెలిపారు. చదువుకునే వయసులో సెల్ ఫోన్లు చూసుకుంటూ సోషల్ మీడియాకు ఆకర్షితులైతే భవిష్యత్తు లక్ష్యాలను సాధించలేరని తెలిపారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే ఆడపిల్లలు తన కాళ్లపై స్వశక్తితో నిలబడగలరని మంచి భవిష్యత్తును పొందగలరని సూచించారు. పదో తరగతి అనంతరం డిప్లమా కోర్సులు అభ్యసించడం వల్ల మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, ఐటిఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కోర్సులు వంటిని వాటిని అభ్యసించి ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు. చిన్నారులు తయారుచేసిన హ్యాండీ క్రాఫ్టును కలెక్టర్‌కు బహుమతిగా అందజేశారు. కలెక్టర్ ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఎవి.సూరిబాబు, బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్‌కె.శైలజ, తహశీల్దార్ ఎన్ఎస్ఎస్‌వి.ప్రసాద్ ఉన్నారు.

## టెట్ బలవంతపు అమలు నిలిపివేయాలి

### ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ ప్రకాశం

ప్రజాశక్తి - భీమవరం

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) బలవంతపు అమలు నిలుపుదల చేయాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు కాపాడుతూ సమర్థవంతమైన తరగతి నిర్వహణకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే టెట్ బలవంతపు అమలు వల్ల సీనియర్ ఉపాధ్యాయులు అనేక మంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితి విద్యావ్యవస్థకు హానికరమని పేర్కొన్నారు. ప్రభుత్వం టెట్ అమలు విషయంలో తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఏ విధంగానైతే సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేసాయో, ఆ విధంగా కూటమి ప్రభుత్వం కూడా రివ్యూ పిటీషన్ వేసి టెట్ నోటిఫికేషన్ నిలుపుదల చేయాలని కోరారు.

**టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి: ఎపిటిఎఫ్**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ఎపి టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బివి.నారాయణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ అమలులోకి రాకముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు

## 27న ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారించాలని, జిఒ 36ను అమలు చేయాలని ఈ నెల 27న విజయవాడ ఆప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నారు. జిల్లాలోని 254 సొసైటీలకు సంబంధించిన సుమారు 1000 మంది ఈ ధర్నాలో పాల్గొనున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం నరసాపురం కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు కార్యదర్శులు, సొసైటీ సిబ్బంది సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ధర్నాలో అన్ని సొసైటీల నుంచి కార్యదర్శులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిఒ 36ను అమలు చేయాలని, ఉద్యోగ భద్రత 62 ఏళ్ల కల్పించాలని, ఎన్నికల్లో ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోయ ఏసుప్రభు, అడపా నాగరాజు, దాసరి శ్రీనివాస్, మేడిది శ్రీనివాస్, దొడ్డ లక్ష్మణ రావు, కొప్పినీడి వెంకటేశ్వరరావు, పి.మాధవరావు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తపై అవగాహనకు సిఆర్‌పిలకు శిక్షణ

ప్రజాశక్తి - ఆకివీడు

తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త సేకరించే వారికి అందించేలా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా సిఆర్‌పిలకు శిక్షణ ఇచ్చి నియమిస్తున్నామని మండల డిప్యూటీ ఎండిఒ ఈడే మార్కండేయశ్వరరావు తెలిపారు. ప్రతి వెయ్యి కుటుంబాలకూ ఒక సిఆర్‌పిని ఎంపిక చేశామన్నారు. ఈ మేరకు మండలంలో 12 గ్రామ పంచాయతీల పరిధిలోని 14,766 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఆ మేరకు 15 మంది సిఆర్‌పిలను ఎంపిక చేసి వారికి ఒక రోజు శిక్షణ ఇచ్చామన్నారు. అభ్యర్థులను స్వయం సహాయక సంఘాల నుండి ఆ శాఖకు చెందిన ఎపిఎం ఎంపిక చేశారని, వారిచ్చిన జాబితా ప్రకారమే శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఈ మేరకు ప్రతి గ్రామంలోనూ 20 రోజుల పాటు వారు ఈ కార్యక్రమం పూర్తి చేస్తారన్నారు. పూర్తి చేసిన వారికి ఒక్కొక్కరికీ ఐదు వేల రూపాయలు చొప్పున పారితోషికం స్వచ్ఛభారత్ నిధులనుండి అందిస్తామని చెప్పారు. అలాగే వేరు చేసిన ఈ తడి చెత్త పొడి చెత్తను సేకరించేందుకుగాను విడివిడిగా ఆయా పంచాయతీలలో షెడ్లు నిర్మాణం జరిగాయన్నారు. అప్పారావుపేట, అజ్జమూరు, చెరుకుమిల్లి, చినమిల్లిపాడు గ్రామాల్లో షెడ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాల్సి ఉందన్నారు.

## ముంపును తట్టుకునే రకాలను రూపొందించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

వాతావరణ మార్పులు, ముంపును తట్టుకుని అధిక దిగుబడినిస్తూ, స్వర్ణ, సాంబ మసూరి రకాలను పోలిన వరి రకాల రూపకల్పన అవసరమని పలువురు సైంటిస్టులు అన్నారు. శుక్రవారం మార్టేరులోని ప్రాంతీయ వరి పరిశోధనాస్థానంలో అంతర్జాతీయ వరి పరిశోధనా స్థానం, మనీలా, ఫిలిప్పైన్స్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు వారి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న పరిశోధనలను, వాటి ప్రగతిని పరిశీలించడానికి అంతర్జాతీయ వరి పరిశోధనా స్థానానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ వసీం హుస్సేన్, డాక్టర్ మహీంద్ర అనుమల్లలు సమగ్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్టేరు కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే కాలాల్లో మూడు వారాల పాటు ముంపును తట్టుకుని, చేనుపై పడిపోకుండా, ఎండాకు తెగులును తట్టుకుని కనీసం రెండు వారాల నిద్రావస్థ కలిగిన రకాల రూపకల్పనకు మార్టేరు పరిశోధన స్థానంతో కలిసి పరిశోధనలు కొనసాగిస్తామని తెలిపారు. సస్య ప్రజనన విభాగానికి చెందిన డాక్టర్ ఎం.గిరిజారాణి, ప్రధాన శాస్త్రవేత్త (వరి), దయాళ్ ప్రసాద్‌బాబు, పివి.రమణారావు, డాక్టర్ వై.సునీత, డాక్టర్.వి.రోజా పరిశోధనా ప్రగతిని అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు వివరించారు. డాక్టర్.బి.సహదేవ రెడ్డి, ఇన్‌ఛార్జి ఎడిఆర్, డాక్టర్ వి.భువనేశ్వరి, డాక్టర్ ఎడివిఎస్ఎల్‌పి ఆనంద్ కుమార్, డాక్టర్ ఎంవి.కృష్ణాజీ పాల్గొన్నారు.

## 26న ఎఎంసి పాలకవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 26న పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించే ఎఎంసి పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కమిటీలు కృషి చేయాలని టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ మంత్రులు, ఎంఎల్ఎలు, కార్పొరేషన్ ఛైర్మన్ ఈ కార్యక్రమానికి విచ్చేయనున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న హాజరై విజయవంతం చేయాలన్నారు.

## గంజాయి విక్రేతలు అరెస్టు

**పెనుగొండ రూరల్:**గంజాయి అక్రమంగా కలిగి ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెనుగొండ మండలం దొంగరావి పాలెం పరిధిలో గోదావరి నదిపై నిర్మితమైన కొత్త వంతెన కింద ఏటిగట్టు వద్ద గంజాయిని అక్రమంగా కలిగి ఉన్న వ్యక్తులపై శుక్రవారం దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో పెనుగొండకు చెందిన మంగిన శ్రీసత్య సాయినాగేంద్ర, మళ్లీపురం దుర్గాసాయి, గెద్దాడ చందు, సిద్ధాంతానికి చెందిన బండారు శివవిష్ణు సాయిరాం, చెరుకువాడకు చెందిన దానేశ్వరరావును అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఐదు కిలోల 630 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిఐ శ్రీరాయుడు విజయ్‌కుమార్ పర్యవేక్షణలో నరసాపురం డిఎస్‌పి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరు పరుస్తామని సీజ్ చేసిన గంజాయి విలువ రూ.11,600 అని తెలిపారు.

## వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని ఆరుగొలనులోని రైతు సేవా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షించారు. టెక్నికల్ అసిస్టెంట్లు, సొసైటీ స్టాఫ్‌తో మాట్లాడారు. అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద కొనుగోలు కేంద్రాల గురించి అధికారులతో చర్చించారు. ప్రతి రైతు సేవా కేంద్రం వద్దా రైతులకు తెలిసే విధంగా వివరాల డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు సంబంధించిన లావాదేవీలు, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ సంబంధించినవి పగడ్బందీగా ఉండాలన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఆర్‌డిఒ ఛాంబర్‌లో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ నెల 27న ఆరుగొలను రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, డిఎస్‌ఒ ఎన్.సరోజ, ఎఎస్‌ఒ ఎం.రవిశంకర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.గంగాధర్, ఎంఎఒ నారాయణరావు, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



## రైల్వే పెండింగ్ పనులు పూర్తి చేయాలి

### కేంద్ర మంత్రి వర్మ సమీక్షలో సమస్యల పరిష్కారానికి డిఆర్‌ఎం హామీ

ప్రజాశక్తి - భీమవరం

పెండింగ్ రైల్వే ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ రైల్వే ఉన్నతాధికారులను ఆదేశించారు. విజయవాడలోని డివిజనల్ రైల్వే కార్యాలయంలో శుక్రవారం డిఆర్‌ఎం మోహిత్ సోనాకియాతో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పలు రైల్వే ప్రాజెక్ట్ పనులు, పలు అంశాలపై రైల్వే ఉన్నతాధికారులతో చర్చించారు. నరసాపురం-కోటిపల్లి రైల్వే లైన్ పనులు ఆలస్యానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నర్సాపురం-మచిలీపట్నం రైల్వేలైన్ పనుల ప్రస్తుత స్థితి, భీమవరం, నర్సాపురం తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో అమృత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిపై చర్చించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాడేపల్లిగూడెంలో హాల్ట్ కల్పించాల్సిన ఆవశ్యకతను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అత్తిలి స్టేషన్‌లో శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ సదుపాయం కల్పించాలని కోరారు. నర్సాపురం నుండి అరుణాచలం ఎక్స్‌ప్రెస్ పూర్తిస్థాయిలో రెగ్యులర్ చేయడం, నర్సాపురం నుండి వారణాసికి ఎక్స్‌ప్రెస్ రైలు సౌకర్యం కల్పించాలని ప్రతిపాదన చేశారు. సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని విజయవాడ డిఆర్‌ఎం మోహిత్ సోనాకియా హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.


రైల్వే డిఆర్‌ఎంతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ

## కర్నూలు బస్సు ఘటనపై ఎంఎల్ఎ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - తణుకు

కర్నూలు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం ఘటనపై తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు కర్నూలు జిల్లాలో అగ్ని ప్రమాదానికి గురై సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ కోరారు.

## ఎస్ఆర్‌కెఆర్‌లో ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్

**తణుకు:** ఈనెల 22వ తేదీన ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరంలో సెట్‌వెల్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా జరిగింది. దీనిలో 120 ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. దానిలో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యూజీ, పీజీ (అటానమస్) తణుకు విద్యార్థినులు పాల్గొని తృతీయ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీ సుందరిబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జి.వర్షిణి, ఇ.సత్య, జిడిఎన్ఎస్ఎస్ వి.మౌనిక, టిజెడి.త్రివేణిలు తృతీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్, చిట్టూరి సత్యఉషారాణి, ఫిజిక్స్ అధ్యాపకురాలు కె.పద్మజారాణి, కె.వెంకటలక్ష్మి, టి.రూపవల్లి, అధ్యాపకులు అభినందించారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న తేగలు

## జోరుగా తేగల విక్రయం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని గాంధీ బొమ్మ కూడలిలో శుక్రవారం తేగల విక్రయాలతో సందడి నెలకొంది. శనివారం నాగుల చవితిని పురస్కరించుకుని వ్యాపారులు తేగలు, బుర్రలు తదితర వాటిని విక్రయించారు. వీటి కొనుగోలుదారులతో గాంధీ బొమ్మ సెంటర్ కళకళలాడింది.